క్లుప్తంగా

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు గ్రామంలోని ట్యాంకు బజారులో ముస్లిం కుటుంబానికి చెందిన ఇల్లు శనివారం వర్షం నీటిలో మునిగింది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న వీరికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాలతో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ప్రసాదం సురేష్, ఇతర నాయకులు ఆదివారం నిత్యావసర సరుకులను అందజేశారు. అలానే ఇతర సదుపాయాలను ఏర్పాటు చేస్తామని భరోసా కల్పించారు.

ఆహార నియమాలతో మూత్రపిండాలు క్షేమం



తెనాలి: తగినంత వ్యాయామం, ఆహార నియమాలతో మూత్రపిండాలు చక్కని పనితీరును కనబరుస్తాయని గుంటూరుకు చెందిన మూత్రపిండాల వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఆవుల శ్రీనివాస్ చెప్పారు. రక్తంలోని మలిన పదార్థాలను మూత్రం ద్వారా విసర్జిస్తూ రక్తాన్ని శుభ్రపరచే మూత్రపిండాలు జాగ్రత్తగా ఉండేలా చూసుకోవటం తప్పనిసరిగా చెప్పారు. వాకర్స్ క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజపార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. 'మూత్రపిండాల వ్యాధులు-తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై డాక్టర్ ఆవుల శ్రీనివాస్ అవగాహన కల్పించారు. మూత్రపిండాలు వైఫల్యం చెందితే ఉబ్బు కామెర్లు, మూత్రకోశంలో రాళ్లు ఏర్పడతాయని చెప్పారు. మధుమేహం, అధిక రక్తపోటుతో మూత్రపిండాలు దెబ్బతింటే డయాలసిస్ చేయాల్సిన అగత్యం ఏర్పడుతుందన్నారు. అందుచేత ఎవరికివారు దైనందిన జీవితంలో నిత్యవ్యాయామం చేస్తూ, వయసుకు తగిన ఆహారం తీసుకుంటే మూత్రపిండాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదనీ, ఆరోగ్యకరంగా జీవించవచ్చని వివరించారు. సభలో డాక్టర్ ఆవుల శ్రీనివాస్, వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తిని సత్కరించారు. కార్యదర్శి కడియాల రవిబాబు, అశోక్‌కుమార్, డాక్టర్ అబ్బయ్య, రత్తయ్య, మొవ్వా సత్యనారాయణ, అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రంలో ఆహార ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ



లంక గ్రామంలో చిక్కుకుపోయిన గొర్రెలను ఒడ్డుకు చేరుస్తున్న పోలీసులు



వరద నీటిలో మునిగిన ఎస్టీ కాలనీ



అన్నవరపు లంకలో వరద ఉధృతి గురించి ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

వరద బీభత్సం.. పంటలు కృష్ణార్పణం

- కృష్ణానది ఉధృతితో నీట మునిగిన అరటి, పసుపు, కంద, మొక్కజొన్న పంట పొలాలు
- దిగువకు 8.50 క్యూసెక్కులు విడుదల చేయడంతో పొంచిఉన్న మరింత ముప్పు
- లంక గ్రామాల్లో పర్యటించిన మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర: కృష్ణానదికి వరద ఉధృతి ఆదివారం సాయంత్రం పెరగటంతో మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పాత బొమ్మువానిపాలెం, అన్నవరపు లంక, కొత్తూరు లంక గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. వరదనీరు పోటెత్తటంతో కృష్ణా కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కరకట్ట కింద ఉన్న వందలాది ఎకరాల్లో అరటి, కంద, పసుపు, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేస్తున్నారు. రెండు రోజులు కురిసిన కురిసిన వర్షానికి, వరద ఉధృతికి పలు చోట్ల అరటి, పసుపు, కంద పంటలు నీటిలో మునిగిపోయాయి. మొన్నటివరకు వర్షాలు లేకపోయినా బోరు నీరు ద్వారా పంటలను కన్న బిడ్డల్లా కాపాడుకుంటూ వచ్చామని, పంటలు ఎటువంటి తెగులు లేకుండా ఏపుగా ప్రారంభం అయ్యే సమయంలో నదికి వరద వచ్చి అన్నీ నీటమునిగిపోయాయని పలువురు రైతులు వాపోయారు. శనివారం రాత్రి కృష్ణా బ్యారేజి నుంచి 8.50లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేయగా అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేశారు. వరద ఉధృతికి తోట్లవల్లూరు మండలం మాదిగల లంకలో చిక్కుకుపోయిన నలుగురిని, 600 గొర్రెలను, స్థానిక ఇన్‌చార్జి ఎస్‌ఐ కోటేశ్వరరావు, ఏఎస్‌ఐ పోతురాజు, సిబ్బంది అశోక్, కూర్మారావు సురక్షితంగా వాటిని పడవలో ఒడ్డుకు చేర్చారు. లంక గ్రామంలోని వృద్ధులను, పిల్లలను, ప్రజలను పునరావాసం కేంద్రానికి అధికారులు 50 మందిని తరలించారు.

లంక గ్రామాలలో వైద్యశిబిరాలు...

రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు, కృష్ణానదికి వరద కారణంగా అధికారులు అప్రమత్తమై అన్నవరపులంక, బొమ్మువానిపాలెం, కొత్తూరు లంక గ్రామంలో వైద్య సిబ్బంది శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు. వరద ఉధృతి తగ్గేవరకు గ్రామంలో ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉంది వైద్యసేవలు అందించటం జరుగుతుందని డాక్టర్ లక్ష్మీసుధ తెలిపారు.



కరకట్ట దిగువన నీట మునిగిన అరటితోట

వరద ఉధృతిని పరిశీలించిన మంత్రి నాదెండ్ల

కృష్ణా నదికి వరద ఉధృతి పెరగటంతో ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నవరపు లంక, పాత్తూరు లంక, పెసర లంక గ్రామాలలో పర్యటించారు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, కృష్ణా నదికి దిగువకు 8.50లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుల చేయటం వలన గ్రామంలోకి వరద వస్తుందని ప్రతి ఒక్కరూ హనుమాన్‌పాలెం, తూములూరులో ఉన్న పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. వరద నీటిలో మునిగిన పంటలను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ వరద తగ్గేవరకు అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

బుర్రిపాలెం ఎస్టీ కాలనీ నీటమునక

తెనాలిరూరల్: భారీ వర్షాల కారణంగా డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని బుర్రిపాలెం గ్రామం వెంబడిగా వెళ్లే రేపల్లె మెయిన్ డ్రెయిన్ పొంగి పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నారు. ఈ డ్రెయిన్‌కు భారీ వరదరావడంతో బుర్రిపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీ పూర్తిగా ముంపునకు గురైంది. కాలనీలో 47 ఇళ్లు ఉండగా 150 మంది నివాసం ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి దాటాక వరద ముంపును గుర్తించిన అధికారులు కాలనీ వాసులను పునరావాస కేంద్రానికి తరలించారు. తెల్లవారుజాము సమయానికి కాలనీలోని అందరినీ తరలించారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో వీరికి విడిది ఏర్పాటు చేసి ఆహారం ఇతర ఏర్పాట్లను చేశారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ముంపునకు గురైన కాలనీని ఆదివారం స్థానికులతో కలసి పరిశీలించారు. అనంతరం జెడ్పీ హైస్కూలులోని పునరావాస కేంద్రానికి వెళ్లి అక్కడ బాధితులకు అందుతున్న సౌకర్యాలు, ఆహారం, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. వీఆర్‌వోలు గ్రామంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.



సోమసుందరపాలెం వద్ద నీటమునిగిన వరిచేలో రైతు

వరి చేలల్లో తొలగని నీరు

తెనాలి: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో కురిసిన కుండపోత వర్షాలకు మునిగిన వరి పొలాల్లోంచి 28 గంటలు గడచినా, వర్షపునీరు ఇంకా తొలగిపోలేదు. మాగాణి రైతులు తేరుకోని పరిస్థితి. తెనాలి ప్రాంతంలో ఎటుచూసినా పంటపొలాలు కనిపించటం లేదు. నిండుగా నీటితో వరిచేలు చెరువులు, నదీపాయల్లా గోచరిస్తున్నాయి. వరిపైరు మొనలు కూడా కనిపించక నీటిలో ఉండటం చూస్తుంటే రైతుల గుండె తరుక్కుపోతోంది. తెనాలి వ్యవసాయ సబ్‌డివిజనులో ఎక్కువశాతం రైతులు వరి నారుతో పనిలేకుండా వరి విత్తనాలు వెదజల్లిన విషయం తెలిసిందే. విత్తనాలు మొలకెత్తిన 20–25 రోజుల దశలో ఉండగా జూలై మూడోవారంలో కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాల్లోని వరి దెబ్బతింది. ఎకరా రూ.22–25 వేలకు కౌలుకు తీసుకున్న రైతులు, అప్పటికే రూ.8 వేల వంతున పెట్టుబడులు పెట్టారు. డ్రైనేజీ కాల్వల్లో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపుడెక్క ఫలితంగా చేలల్లో నిలిచిన నీరు త్వరితగతిన బయటకు పోలేదు. ఫలితంగా తెనాలి సబ్‌డివిజనులో అప్పట్లో 2,225 ఎకరాల్లో నీట మునిగిన వరిపైరు దెబ్బతింది. ఆయా పంటపొలాల్లో కొందరు రైతులు రెండోసారి వెదజల్లితే, పంట ఆలస్యం అవుతుందన్న భావనతో రైతులు ఇతర ప్రాంతాల్నుంచి వరి నారును తీసుకొచ్చి, నాట్లు వేశారు. ఇందుకోసం ఎకరాకు రూ.15 వేల వంతున ఖర్చు చేసినట్టు పట్టణ హయ్యర్‌పేటకు చెందిన కౌలు రైతు వంపుగళ్ల సుమంత్ వెల్లడించారు. ప్రస్తుతం వెదజల్లిన చేలల్లో వరి 60 రోజుల దశలో ఉండగా, రెండోసారి నాట్లు వేసి నెలరోజులు పైగా అయింది. శుక్ర, శనివారాల్లో కురిసిన భారీ వర్షాలకు పంటచేలు మునిగిపోవడంతో రైతులు, కౌలురైతుల ఆందోళన అంతాఇంతా కాదు. వర్షం ఆగిపోయి వరదనీరు చేలల్లోంచి త్వరగా వెళ్లిపోతే ఫర్వాలేదు...రోజుల తరబడి నిలిచివుంటే మాత్రం వరి చేతికొచ్చే ఆశ లేదని తేలప్రోలుకు చెందిన రైతు వేజెండ్ల రోశయ్య ఆవేదనగా అన్నారు. నీటమునిగిన వరి పొలాల రైతులకు ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారాన్ని ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. రైతులతో కలిసి ఆదివారం ఆయన అయితానగర్, తేలప్రోలులో మునిగిన పంటపొలాలను సందర్శించారు. తెనాలి వచ్చిన జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లును కలిసి రైతుల ఇబ్బందులను ఏకరువు పెట్టారు.

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కొత్తూరు లంక గ్రామాల ప్రజలకు సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర: సాగర్ డ్యామ్ నుంచి శనివారం రాత్రి దిగువకు నీటి విడుదల చేసిన నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. కొల్లిపర మండల లంక గ్రామాల్లో ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ సిద్ధార్థలు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. కృష్ణా నది రేవులను పర్యవేక్షించి అన్నవరపు లంక, కొత్తూరు లంక, బొమ్మువానిపాలెం ప్రజలతో మాట్లాడారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో మాట్లాడుతూ గ్రామాల్లోని పరిస్థితులు ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ, తమ దృష్టికి తేవాలన్నారు. ఈఓపీఆర్డీ పూర్ణశంకరరావు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎకరాకు రూ.10–15 వేల పరిహారం ఇప్పించాలి
- ఇప్పటివరకు రైతుభరోసా ఆర్థికసాయం చేయనేలేదు
- ఎరువులు కూడా అరకొరగానే పంపిణీ చేశారు
- నీట మునిగిన పంటపొలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



చెరువుల్లా మారిన పంటపొలాల వద్ద రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: వాయుగుండం కారణంగా రికార్డుస్థాయిలో కురిసిన వర్షాలకు నష్టపోయిన మాగాణి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.10–15 వేల చొప్పున పరిహారం ఇప్పించాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ డిమాండ్ చేశారు. రూరల్ మండలంలోని కఠెవరం, కోపల్లె, ఎరుకలపూడి, గుడివాడ గ్రామాల్లోని పంటపొలాలను ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఎటుచూసినా చెరువుల్లా మారిపోయిన పంటపొలాలే కనిపించాయి. వరి సాగు చేలల్లో మొనలు కూడా కనిపించని దుస్థితిని చూసి చలించిపోయారు. రైతుల ఆందోళన అంతా ఇంతా కాదు. తమ దగ్గరకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌ను చూసి పరుగున దగ్గరకు వచ్చారు. తమ కష్టాలను ఏకరువు పెట్టారు. గత నెలలో వచ్చిన వర్షాలకు ఒకసారి పంట పోయిందని, మరోసారి వెదజల్లాల్సి వచ్చిందన్నారు. పెట్టుబడి ఖర్చులకే ఇప్పటికి రూ.15–20 వేలు వ్యయం చేశామని రైతులు చెప్పారు. రెండుసార్లుగా వేసిన వరి ప్రస్తుత వర్షాలకు మళ్లీ బతికి బట్ట కడుతుందన్న పరిస్థితి కనిపించటం లేదన్నారు. ప్రభుత్వం ఆదుకోకుంటే తమకు ఆర్థిక ఇబ్బందులు తప్పవని వాపోయారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అయిదేళ్లూ రైతును సాధ్యమైనంతవరకు నిలబెట్టేందుకు కృషి జరిగిందన్నారు. విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చి ఆర్‌బీకేలతో విత్తనాలు, ఎరువుల పంపిణీ, ఏ సీజనులో పంట నష్టానికి అదే సీజనులో పరిహారం, అన్నిటికీ మించి రైతుభరోసా నగదు సాయం చేసినట్టు గుర్తుపెట్టారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుభరోసా సాయం ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. ఎరువులు కూడా అరకొరగానే ఇచ్చినట్టు రైతులు చెప్పారని తెలిపారు. ప్రస్తుతం చేలను ముంచేసిన వర్షపునీరు బయటకు పోయేందుకు కనీసం వారంరోజులు వ్యవధి పట్టేలా ఉందన్నారు. అప్పటికి పైరు బతికే అవకాశం ఉండదన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని కోరారు. వీరితో జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, యలవర్తి సాంబశివరావు, మొగల్ అహ్మద్‌బేగ్ తదితరులున్నారు.

రేపు తెనాలి ఐటీఐలో జాబ్‌మేళా

తెనాలిఅర్బన్: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తెనాలి చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావి చినవెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో ఆపిక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, బుక్ ఎక్స్‌పర్ట్, క్యాప్‌స్టాన్ సర్వీస్ లిమిటెడ్ తదితర కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్/ఫెల్, డిప్లమో పూర్తిచేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు.

డాక్టర్ శ్రీనివాస్‌కు బంగారు పతకం

తెనాలిరూరల్: పట్టణ బోస్‌రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణానికి చెందిన ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి ధార్మిక బంగారు పతకాన్ని నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఆవుల శ్రీనివాస్‌కు బహూకరించారు. ఈ సందర్భంగా నెఫ్రాలజిస్టుల వైద్య విధానాలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాల గురించి ఆయన ప్రసంగించారు.డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ పాటిబండ్ల వేణుగోపాల్, డాక్టర్ మధు ప్రభాకర్, ఇతర పట్టణ ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీనివాస్‌కు బంగారు పతకాన్ని బహూకరిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దక్షిణామూర్తి

పేద బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో అనంతబాబు, అనంతాచార్యులు

తెనాలిఅర్బన్: తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డిపాలెంకు చెందిన శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ప్రతినిధులు, ప్రవాస భారతీయుడు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమవతమ్మల సహకారంతో తెనాలిలోని వేణుగోపాలస్వామి దేవస్థాన ప్రాంగణంలో పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆదివారం స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి దివి అనంతబాబు మాట్లాడుతూ 15 మంది బ్రాహ్మణ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున ఉపకార వేతనం పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర అర్చక సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ అనంతాచార్యులు, ఆల్ ఇండియా అర్చక ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.శ్రీనివాసమూర్తిలు మాట్లాడుతూ బ్రాహ్మణ జాతిపై ఉన్న గౌరవంతో రామిరెడ్డి, హైమవతమ్మలు ప్రతి నెల అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం బయోటెక్నాలజీలో 92 శాతం మార్కులు సాధించి బంగారు పతకం సాధించిన దివి సర్వజ్ఞ సింధును సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. దివి లక్ష్మీనరసింహాచార్యులు, తమిరిస రఘు, తమరిస హరిబాబు, నారాయణ, పావని, స్రవంతి, దివి రాధాకృష్ణమాచార్యులు, వేదాంతం నాగమారుతీ పాల్గొన్నారు.

5న కౌలురైతుల రాష్ట్ర సదస్సు

తెనాలి: సీసీఆర్‌సీ కౌలుచట్టాన్ని రద్దుచేసి కౌలురైతులకు మేలుచేకూర్చేలా నూతన కౌలుచట్టాన్ని తీసుకురావాలని కోరుతూ ఈనెల 5న విజయవాడలో జరిగే కౌలురైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు కోరారు. స్థానిక అయితానగర్‌లోని ఎర్రబడి సెంటర్‌లో ఆదివారం కౌలురైతుల సమావేశంలో సంబంధిత కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయంలో కీలకపాత్ర పోషించే కౌలురైతులకు సీసీఆర్‌సీ కౌలుచట్టం వల్ల ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు పొందలేకపోవటం వల్ల నష్టపోతున్నారని చెప్పారు. సెప్టెంబరు 5వ తేదీన ఉదయం 9 గంటలకు విజయవాడలోని రాఘవయ్య పార్కు వద్ద గల ఎంబీ భవన్‌లో జరిగే రాష్ట్ర సదస్సుకు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు హాజరవుతారని తెలిపారు. కౌలురైతులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. వీరితో ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, మేకల చిట్టిబాబు, వంపుగళ్ల సుమంత్, మేకల సురేష్, గొరికపూడి శ్రీనివాసరావు, ఎం.జయరావు, వేజెండ్ల ప్రేమ్‌కుమార్, గడ్డిపాటి అశోక్ పాల్గొన్నారు.

పూలే కాలనీలో వర్షపు నీరు తొలగింపు

తెనాలిఅర్బన్: అల్పపీడనం ప్రభావం వలన తెనాలి పట్టణంలో రెండు రోజులు నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పూలే కాలనీ జలమయమైంది. కాలనీలోని రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాటిని బయటకు పంపేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం మోటార్‌లను ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపుతున్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకం



పుస్తకావిష్కరణలో లక్ష్మణరావు, ఇతర ప్రముఖులు

తెనాలి: ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆదివారం ఇక్కడి కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగిన సభలో పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయ ప్రముఖుడు కనపర్తి బెన్‌హర్ ఉద్యోగ విరమణ సందర్భంగా పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్యారంగంలో రావాల్సిన మార్పులపై ఏర్పాటైన సదస్సుకు దేవిరెడ్డి శివనాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. బెన్‌హర్ రచించిన వ్యాసాల సంకలనం 'అంతరాలు లేని సమాజం కోసం' పుస్తకాన్ని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించారు. సదస్సులో మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో పరిరక్షించుకోవాలని లక్ష్మణరావు స్పష్టంచేశారు. ఇందుకోసం తగిన కృషి జరగాలని చెప్పారు. విద్యారంగంలో లోపాలను ఎత్తిచూపుతూ విమర్శించినంత మాత్రాన ఉపయోగం ఉండదన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తన ప్రసంగంలో, భవిష్యత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ విద్యావిధానానికి ప్రాధాన్యత పెరుగుతుందని చెప్పారు. ఇస్రో మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు మాట్లాడుతూ బెన్‌హర్ కుటుంబమంతా ఉపాధ్యాయ వృత్తిలోనే సేవలను అందించారని చెప్పారు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి కనపర్తి బెన్‌హర్ వన్నె తీసుకొచ్చారని అభినందించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీనియర్ నేత కనపర్తి కృపాదాను, తెనాలి కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, తెనాలి మండల విద్యాధికారి-2 జయంత్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జోసెఫ్ సుధీర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు పెదబాబు, కనపర్తి మేరీ రత్నకుమారి, వివిధ ప్రజా, కళా, సాంస్కృతిక, అంబేడ్కర్ సంస్థల బాధ్యులు రావూరి శివకృష్ణ, దూల సందీప్, బొల్లిముంత కృష్ణ, చందు సుబ్బారావు, వేము సమత, పినపాటి రవికుమార్, డీవీ సుబ్బారావు, రమేష్ పట్నాయక్, బండికళ్ల సతీష్, బి.సుధాకర్, అంగిరేకుల ప్రసాద్‌బాబు, బీవీ నారాయణ, దేవరపల్లి నీలాంబ్రం, లోకం భాస్కరరావు తదితరులు ప్రసంగించారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు అభ్యుదయ గేయాలను ఆలపించారు. డాక్టర్ ఐనంపూడి శరత్‌బాబు, బెజ్జంకి నాగమణి దేశభక్తి గీతాలను గానం చేశారు.

విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ

తెనాలి: వర్షం కారణంగా నీట మునిగిన పట్టణ ఆర్ఆర్ నగర్‌లో గల సాంఘిక సంక్షేమ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం వారు ఆశ్రయం పొందుతున్న పాఠశాల వద్ద ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్‌బ్రాంచి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి మాట్లాడుతూ వర్షాలకు వసతిగృహంలోకి నీరు చేరడంతో విద్యార్థినులను దగ్గరలోని మున్సిపల్ పాఠశాలలో ఉంచినట్లు ఎంఈఓ ద్వారా తెలుసుకొని తమ వంతు సాయంగా దుప్పట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. న్యాయవాది హరిదాసు గౌరీశంకర్ మాట్లాడుతూ విద్యార్థినులను కలిసి వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నట్టు చెప్పారు. మొత్తం వందమందికిపైగా విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ జరిగిందని, అడగ్గానే సాయం చేసేందుకు ముందు కు వచ్చిన రెడ్ క్రాస్ సభ్యులకు ఎంఈఓ ఎం.లక్ష్మీనారాయణ హాస్టల్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. కుర్రా శ్రీను, కుర్రా సుజాత, 23వ వార్డు జనసైనికులు, వీరమహిళలు, పాఠశాల హెచ్‌ఎం బత్తుల శ్రీనివాసరావు, సీఆర్‌ఎంటీ శ్రీదేవి పాల్గొన్నారు.

